తెలుగు దినపత్రిక

సూర్యోదయ వార్త

ప్రతి అక్షరం ప్రజల కోసం...

తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి: 2 | సంచిక 134 : 21 | శనివారం 10.10. 2026 | పేజీలు :4 | వెల: 2

ఉపఎన్నికల్లో ఎన్‌డీఏ అఖండ విజయం



- సుపరిపాలన ఎజెండాకు ప్రజల పట్టాభిషేకం అని మోదీ హర్షం!
- ప్రజల విశ్వాసానికి కృతజ్ఞతలు తెలిపిన ప్రధాని
- సుపరిపాలనకు లభించిన మద్దతుగా అభివర్ణన

భారత సంతతి నవనీతమ్ నవీ పిళ్లైకి నోబెల్ శాంతి బహుమతి

అంతర్జాతీయ చట్టాల పరిరక్షణ, మానవ హక్కుల పరివర్తన, ప్రపంచ శాంతి స్థాపనకు దశాబ్దాలుగా అంకితభావంతో సేవలందిస్తున్న దక్షిణాఫ్రికాకు చెందిన భారతీయ తమిళ సంతతి ప్రముఖ న్యాయకోవిదురాలు నవనీతమ్ "నవీ" పిళ్లైకి ప్రతిష్టాత్మక 'నోబెల్ శాంతి బహుమతి-2026' లభించింది.



ఈగను చంపడానికి సుత్తిని వాడలేరు



'కాక్రోచ్ జనతా పార్టీ' శనివారం (అక్టోబర్ 10) చేపట్టిన ధర్నాను అడ్డుకునేందుకు కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ పోలీసులు విధించిన కఠిన ఆంక్షలపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. నిరసనలను నియంత్రించే నెపంతో సామాన్య పౌరుల రాకపోకలపై పూర్తి నిషేధం విధించడం, రవాణా వ్యవస్థను స్తంభింపజేయడం రాజ్యాంగబద్ధం కాదని స్పష్టం చేసింది.

2

ఢిల్లీలో నిరసనల సెగ



ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియలో పారదర్శకత లోపించిందని, 13 కోట్లకు పైగా ఓట్ల తొలగింపునకు బాధ్యత వహిస్తూ కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ 'కాక్రోచ్ జనతా పార్టీ' శనివారం (అక్టోబర్ 10) చేపట్టిన ధర్నాను అడ్డుకునేందుకు కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ పోలీసులు విధించిన కఠిన ఆంక్షలపై భారత అత్యున్నత న్యాయస్థానం (సుప్రీంకోర్టు) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. నిరసనలను నియంత్రించే నెపంతో సామాన్య పౌరుల రాకపోకలపై పూర్తి నిషేధం విధించడం, రవాణా వ్యవస్థను స్తంభింపజేయడం రాజ్యాంగబద్ధం కాదని స్పష్టం చేసింది. "ఈగను చంపడానికి సుత్తిని ఉపయోగించలేరు" అంటూ ప్రభుత్వం అనుసరించిన అతి కఠిన విధానాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఘాటుగా తప్పుపట్టింది.

హైదరాబాద్ సూర్యోదయ వార్త

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలంటూ కాక్రోచ్ జనతా పార్టీ శనివారం చేపట్టనున్న భారీ నిరసన నేపథ్యంలో దేశ రాజధాని ఢిల్లీ అట్టుడుకుతోంది. జంతర్‌మంతర్ వద్ద ఆందోళనకు పోలీసులు అనుమతి నిరాకరించినప్పటికీ నిరసన నిర్వహించి తీరుతామని నిర్వాహకులు ప్రకటించడంతో కేంద్ర ఢిల్లీని భద్రతా బలగాలు తమ ఆధీనంలోకి తీసుకుంటున్నాయి. వేలాది మంది పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలను మోహరించడంతోపాటు ప్రధాన రహదారుల్లో బారికేడ్లు ఏర్పాటు చేశారు. శుక్రవారం రాత్రి

అర్ధరాత్రి నుంచి ఇంటర్నెట్ బంద్?

జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా డిమాండ్‌తో నేడు ధర్నాకు పిలుపు

- అనుమతి నిరాకరించినా ఆందోళనకు సిద్ధమంటున్న సీజేపీ
- 57 మెట్రో స్టేషన్ల మూసివేత.. భారీ బందోబస్తు అంటూ ప్రచారం
- కేంద్ర ఢిల్లీలో నిషేధాజ్ఞలు.. పోలీసుల అప్రమత్తత
- నిరసనలపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన పార్టీ





హైదరాబాద్ ట్రాఫిక్‌కు ఇక చెక్!

కొత్త రవాణా వ్యవస్థకు శ్రీకారం!

హైదరాబాద్‌లో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ఏం చేయబోతోంది? నిత్యం రద్దీతో సతమతమవుతున్న నగరవాసులకు కొత్త ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి రానుందా? మెట్రో, ఎంఎంటీఎస్, బస్సులతోపాటు మరో అత్యాధునిక రవాణా వ్యవస్థ నగర రోడ్లపైకి రాబోతోందా..? ఈ ప్రశ్నలకు సమాధానంగా ప్రభుత్వం సరికొత్త ప్రణాళికలపై కసరత్తు ప్రారంభించింది. మహానగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు వ్యక్తిగత వేగవంత రవాణా వ్యవస్థను ప్రవేశపెట్టే అవకాశాలను పరిశీలిస్తోంది. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా క్యూర్ పరిధిలో ప్రజా రవాణా సదుపాయాలను మెరుగుపరచాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

- నగర రవాణా వ్యవస్థలో భారీ మార్పులకు సర్కారు కసరత్తు
- రద్దీ ప్రాంతాల్లో సరికొత్త వ్యక్తిగత వేగవంత రవాణా వ్యవస్థ
- కేబీఆర్ పార్కు చుట్టూ వన్‌వే.. ఫ్లైఓవర్లకు వేగం
- ఏడాదిలోగా రహదారి పనులు పూర్తి చేయాలని సీఎం ఆదేశం

పెట్టుబడులే లక్ష్యంగా గ్లోబల్ సమ్మిట్: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



ప్రపంచ స్థాయి పెట్టుబడులే లక్ష్యంగా ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. శుక్రవారం గ్లోబల్ సమ్మిట్ నిర్వహణ కోసం ప్రజా భవన్‌లో ఏర్పాటు చేసిన వార్ రూమ్‌ను ఆయన సందర్శించి పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిసెంబర్ 7,8,9 తేదీలలో నిర్వహించే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2.0కు ప్రభుత్వం ఏర్పాటు చేసిన వివిధ కమిటీలు సమన్వయంతో పనిచేసి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల అధికారులకు అప్పగించిన బాధ్యతలను అత్యంత సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. శాఖల మధ్య నిరంతర సమాచార మార్పిడి, సమన్వయం ఉండేలా స్పష్టమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, ప్రపంచస్థాయి పెట్టుబడులను ఆకర్షించడం, అంతర్జాతీయంగా రాష్ట్ర ప్రతిష్ఠను సరికొత్త శిఖరాలకు తీసుకెళ్లే లక్ష్యంతో ఈ సమ్మిట్‌ను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక, ప్లానింగ్ ముఖ్య కార్యదర్శి గౌరవ్ ఉప్పల్‌తోపాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగం కంటే గొప్పది ఏదీ లేదు: కేటీఆర్

హైదరాబాద్ సూర్యోదయ వార్త

భారత రాజ్యాంగం కంటే గొప్పది ఏదీ లేదని.. ఈ దేశంలో ఏ ఒక్క పౌరుడి ఓటు హక్కునూ లాక్కునే అధికారం ఎవరికీ లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'ఎక్స్'లో స్పష్టం చేశారు. వ్యవస్థల కంటే వ్యక్తులు ఎన్నడూ గొప్పవారు కారని.. రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తున్న జ్ఞానేష్ కుమార్ తక్షణమే తన బాధ్యతల నుంచి వైదొలగాలని డిమాండ్ చేశారు. 'ఈ దేశం ఎందరో వ్యక్తులను చూసింది, ఎందరో వచ్చారు.. పోయారు. వాటన్నింటినీ తట్టుకుని భారతదేశం ఎంతో బలంగా నిలబడింది, సగర్వంగా ముందుకు సాగుతున్నది. అలాంటిది వ్యవస్థలను పక్కనపెట్టి, ఒక్క వ్యక్తిని కాపాడటానికి ఇంతటి తాపత్రయం ఎందుకు?' అని ప్రశ్నించారు. 140 కోట్ల మంది భారతీయుల ప్రాథమిక హక్కుల కంటే ఆ ఒక్క వ్యక్తి ఎలా గొప్పవాడయ్యాడని నిలదీశారు. దేశ మూల సిద్ధాంతాలను, ఆత్మను తుంగలో తొక్కుతూ సమాంతర వ్యవస్థలను నిర్మించాలని చూసే వారికి కాలం చెల్లిందని హెచ్చరించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో జరిగిన తీవ్ర అక్రమాలు, అవకతవకలపై భారత అత్యున్నత న్యాయస్థానం స్పందించాలని కోరారు. సుప్రీంకోర్టు ఈ వ్యవహారాన్ని సుమోటోగా స్వీకరించి, సిట్టింగ్ జడ్జితో స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని విజ్ఞప్తి చేశారు.

కల నెరవేరి పదేళ్లు పూర్తి

- నాటి గోడ మీద రాతలే నేడు నిజయమ్యాయి
- జిల్లా కోసం ఎన్టీఆర్ కు వినతిపత్రం ఇచ్చిన కేసీఆర్
- అదే కేసీఆర్ సీఎంగా సిద్దిపేట జిల్లా ఏర్పాటు
- రైలు, గోదావరి జలాలు సిద్దిపేటకు వచ్చాయి
- సిద్దిపేట దశాబ్ది ఉత్సవాల్లో హరీశ్ రావు





అర్ధరాత్రి బర్త్‌డే వేడుకలా..

ప్రాణాలతో చెలగాటమే!

- ఇళ్లలోనే సురక్షితంగా వేడుకలు చేసుకోవాలన్న సీపీ సజ్జనార్
- ట్యాంక్‌బండ్‌పై చిన్నారి, బంధువు మృతి నేపథ్యంలో పోలీసుల హెచ్చరిక

రాజ్యాంగ సంస్థలపై కాంగ్రెస్‌ది దుష్ప్రచారం

హైదరాబాద్ సూర్యోదయ వార్త

రాహుల్‌గాంధీ వ్యవహారశైలిలో వింత, ప్రమాదకరమైన ధోరణి కనిపిస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాజ్యాంగ సంస్థలు తమకు అనుకూలంగా పని చేస్తే ప్రజాస్వామ్యమని, లేకపోతే ఆ వ్యవస్థలపై దుష్ప్రచారం చేయడం రాహుల్‌గాంధీకి అలవాటుగా మారిందని శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో విమర్శించారు. ఎన్నికల సంఘం, కాగ్, న్యాయ వ్యవస్థ వంటి అత్యున్నత వ్యవస్థలు తమ రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా నడుచుకోలేదనే కారణంతో వాటి విశ్వసనీయతను దెబ్బతీసేలా కాంగ్రెస్ కుట్రలు చేస్తోందని కిషన్ రెడ్డి ఆరోపించారు. భారత్ రాజ్యాంగ వ్యవస్థ కాదని, రాహుల్ గాంధీ తన ఫ్యూడల్ మనస్తత్వాన్ని వీడాలని హితవు పలికారు. రాజ్యాంగ సంస్థలు ఎవరి జేబు సంస్థలు కావు కాబట్టి, ఓటములను జీర్ణించుకోలేక వ్యవస్థలపై నిందలు వేయడం తగదన్నారు. గతంలో యూపీయే ప్రభుత్వ హయాంలో ఆర్డినెన్స్‌ను బహిరంగంగా చించివేయడం ద్వారా నాటి ప్రధాని మన్మోహన్ సింగ్‌ను, అలాగే పీవీ నరసింహారావును కాంగ్రెస్ పార్టీ ఏ విధంగా అవమానించిందో దేశ ప్రజలు ఇంకా మరిచిపోలేదని గుర్తుచేశారు. దేశంలో ప్రజాస్వామ్యం కుప్పకూలిందంటూ విదేశీ గడ్డపై రాహుల్ గాంధీ ఆరోపణలు చేయడం ద్వారా భారత గౌరవాన్ని, ఆర్థికాభివృద్ధిని దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాజ్యాంగ సంస్థలపై నిరాధార ఆరోపణలు మాని, ప్రజాతీర్పును గౌరవించడం నేర్చుకోవాలని, ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకోవడంపై దృష్టి పెట్టాలని కిషన్ రెడ్డి రాహుల్‌గాంధీకి సూచించారు.





ప్రజాస్వామ్యానికి గుండె చప్పుడు సమాచార హక్కు!

- పారదర్శక పాలనకు, జవాబుదారీతనానికి బలమైన పునాది
- ప్రతి దరఖాస్తు వెనుక ఓ సమస్య.. న్యాయం కోసం ప్రయత్నం
- ప్రజలు అడగకముందే సమాచారం అందుబాటులో ఉంచాలి
- 'సమాచార దర్పణం' ఆవిష్కరించిన గవర్నర్ శివప్రతాప్ శుక్లా

3

తెలుగు దినపత్రిక
సూర్యోదయ వార్త
ప్రతి అక్షరం ప్రజల కోసం...

మహిళా సాధికారతకు బతుకమ్మ వేడుకలు ప్రతీక..!

- చిరుతపల్లి--2 గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలు..
- విద్యార్థుల విద్యా ప్రగతి, భవిష్యత్ ప్రణాళికలపై తల్లిదండ్రులతో సమీక్ష..





వెంకటాపురం. నూగూరు. ములుగు జిల్లా అక్టోబర్. 09(సూర్యోదయ వార్త.)

ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల చిరుతపల్లి--2లో శుక్రవారం ముందస్తు బతుకమ్మ సంబరాలతో పాటు తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె. ఉష అధ్యక్షతన ఈ కార్యక్రమాలు నిర్వహించారు..ముందస్తు బతుకమ్మ వేడుకల్లో భాగంగా తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ ప్రాముఖ్యతను విద్యార్థినులకు వివరించారు. స్థానిక సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు.అనంతరం నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో విద్యార్థుల విద్యా ప్రగతి, హాజరు, అభ్యసన సామర్థ్యాలు, పరీక్షల పనితీరు, భవిష్యత్ విద్యా ప్రణాళికలపై చర్చించారు. పాఠశాలలో అమలవుతున్న విద్యా విధానం, విద్యార్థులకు అందిస్తున్న మెనూ వివరాలను తల్లిదండ్రులకు తెలియజేశారు.అలాగే పాఠశాలలో నిర్వహిస్తున్న ఐదు రకాల క్లబ్బుల లక్ష్యాలు, వాటి ద్వారా విద్యార్థుల్లో విద్యా నైపుణ్యాలు, సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, సాంస్కృతిక అవగాహనను పెంపొందించేందుకు చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పరస్పర సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు వివరించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుజన్‌కుమార్, రామయ్య, శైలజ , సంధ్యారాణి, నవీన్, వీరన్న, రామదాసు, శంకర్ నారాయణ, విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.పాఠశాల--తల్లిదండ్రుల సమన్వయంతో విద్యార్థుల విద్యా ప్రగతిని మెరుగుపరచడంతో పాటు, తెలంగాణ సంస్కృతి--సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించడమే కార్యక్రమాల ప్రధాన లక్ష్యంగా నిలిచింది...

కమలాపురం పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలు..!



మంగపేట. ములుగు జిల్లా. అక్టోబర్ 09(సూర్యోదయ వార్త)

ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపూర్ పాఠశాల లో మహిళా ఉపాధ్యాయులు సహకారం తో శుక్రవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు అందరూ కలిసి బతుకమ్మలను ఆటపాటలతో డ్యాన్సులతో సందడి చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం . గడ్డి శ్రీనివాసు మాట్లాడుతూ. బతుకమ్మ పండుగ ప్రకృతి తో మమేకం అయి తీరొక్క పూలతో అనుబంధాన్ని ఆత్మీయతను పంచె పండుగ అని అందరు భక్తి శ్రద్దలతో జరుపుకోవాలని కోరారు. విద్యార్థులు పండుగ పూట చెరువు ల దగ్గరికి వెళ్లకుండా జాగ్రత్త గా ఉండాలని కోరారు ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ ర్గడ్డి శ్రీనివాస్ ఏ ఏ పి సి చైర్మన్ పార్వతి ఉపాధ్యాయులు ప్రసాద్ నాగలక్ష్మి నాగమ్మ భూలక్ష్మి రవీందర్ రాజేశ్వర సార్ రమేష్ తదితరులు విద్యార్థులు పాల్గొన్నారు..

కొత్త క్రిమినల్ చట్టాల అమలులో ములుగు టాప్..!

తెలంగాణ రాష్ట్ర డిజిపి - ఆనంద్.

ములుగు. అక్టోబర్ 09(సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)



కొత్త క్రిమినల్ చట్టాల అమలులో ములుగు జిల్లా తెలంగాణ రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచింది. టీజీపి ఆనంద్ నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్ష సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. జీరో ఎఫ్ ఐ ఆర్. ఆన్ లైన్ చార్జిషీట్.ఈ – సాక్ష్య. ఈ – సామాన్ల అమలను మరింత సమర్థంగా చేపడితే జాతీయస్థాయిలో రాష్ట్ర ర్యాంకింగ్ మెరుగు పడుతుందని ఆయన తెలిపారు. మెరుగైన పనితీరుతో జాతీయస్థాయిలో గుర్తింపు సాధించవచ్చని పేర్కొన్నారు..

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

సుజాతనగర్ పీఎం శ్రీ జిల్లా పరిషత్ పాఠశాలలో

ఘనంగా ముందస్తు బతుకమ్మ సంబరాలు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా. సుజాతనగర్, అక్టోబర్ 09 సూర్యోదయ వార్త :

తెలంగాణ రాష్ట్ర పండుగ బతుకమ్మ పండుగను పురస్కరించుకుని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ కార్పొరేషన్ పరిధిలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో గురువారం ముందస్తు బతుకమ్మ సంబరాలను అత్యంత ఘనంగా, ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినులు తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర రంగురంగుల పూలతో అందమైన బతుకమ్మలను పేర్చారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ఆడపడుచులు సంప్రదాయ దుస్తుల్లో ముస్తాబై బతుకమ్మ చుట్టూ కోలాటం వేస్తూ, బతుకమ్మ పాటలు పాడుతూ సందడి చేశారు.తెలంగాణ ఆడపడుచుల



ఆత్మీయతకు, ప్రకృతిని ఆరాధించే గొప్ప సంప్రదాయానికి ప్రతీక బతుకమ్మ పండుగ అని, నేటి తరం విద్యార్థుల్లో మన సంస్కృతి, సంప్రదాయాల విలువలు, పూల ప్రాధాన్యత, ఐక్యత భావం పెంపొందించడమే ఈ వేడుకల ముఖ్య ఉద్దేశమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పేర్కొన్నారు.పాఠశాలలో ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం వల్ల



విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత వెలికి వస్తుందని ఉపాధ్యాయులు అన్నారు. బతుకమ్మ తయారీలో, పాటలు పాడడంలో విద్యార్థినులు చూపిన ఉత్సాహం అభినందనీయమని కొనియాడారు. ఈ ముందస్తు బతుకమ్మ సంబరాల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని సందడిగా జరుపుకున్నారు.

ములుగు జిల్లాలో ఇసుక లారీల వేగానికి బ్రేక్..!

- రోడ్డు ప్రమాద నివారణకు కఠిన చర్యలు..
- జిల్లా ప్రారంభం నుండి జిల్లా ముగింపు వరకు ప్రత్యేక అదనపు బలగాలతో 24/7 డ్రంక్ అండ్ డ్రైవ్ చెక్...
- ఇసుక లారీలు స్పీడ్ లిమిట్ దాటితే ఇకపై సీజ్..
- ములుగు జిల్లా ఎస్పీ. సుధీర్ రామ్నాథ్ కేకన్

(సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

– ములుగు జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలుజిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను మరింత పెంచే దిశగా అధికారులు పనిచేయాలని ఆదేశించారు.జిల్లాలోని ప్రధాన ప్రాంతాల్లో 24/7 రౌండ్ ద క్లాక్ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేకంగా అదనపు పోలీస్ సిబ్బందిని



కేటాయించి నిరంతర తనిఖీలు చేపట్టాలని సూచించారు.స్థానిక పోలీస్ అధికారులు తమ పరిధిలోని లారీ డ్రైవర్లతో సమావేశాలు నిర్వహించి, అధిక వేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, నిద్రలేమి తదితర కారణాలతో జరిగే ప్రమాదాలపై అవగాహన కల్పించాలని ఎస్పీ ఆదేశించారు.కమలాపురం, మండపాక, తాడ్వాయి, జవహర్‌నగర్ టోల్‌గేట్ తదితర ప్రాంతాల్లో 24/7 డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను పటిష్టంగా నిర్వహించాలని సూచించారు. లారీల వేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్ లాక్, ఇసుక లారీల కారణంగా సంభవించే రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు తీసుకోవాల్సిన నివారణ చర్యలపై ఖనిజ ఉన్నతాధికారితో ఎస్పీ చర్చించారు. ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలిస్థానిక ఎస్ఐలు తమ పరిధిలోని పోలీస్ స్టేషన్లు, చెక్‌పోస్టులు, ప్రధాన రహదారులు మరియు అనుమానాస్పద ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారు.నేర నియంత్రణతో పాటు ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. ఈ నేర సమీక్షా సమావేశంలో ఏటూరునాగారం ఏ ఎస్పీ మనన్ బట్ ఐపీఎస్ అదనపు ఎస్పీ సదానందం, ములుగు సబ్ డివిజనల్ పోలీస్ అధికారి రవీందర్, డి సి ఆర్ బి డి ఎస్ పి కిషోర్ కుమార్, ఎస్ బి ఇన్స్పెక్టర్ ప్రతాప్, స్థానిక సీఐలు, ఆర్మడ్ రిజర్వుడ్ ఇన్స్పెక్టర్ లు,ఎస్ఐలు, ఐ టీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక లారీలను నియంత్రించాలని తహసిల్దార్‌కు వినతి..

జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వినతి


పత్రాలు అధికారులకు అందజేత..

మంగపేట. ములుగు జిల్లా అక్టోబర్ 09(సూర్యోదయ వార్త)

తెలంగాణ రాష్ట్రంలో అతిపెద్ద పండుగలలో ఒకటైన దసరా నవరాత్రులు ఈ నెల 10వ తేదీ నుండి ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ములుగు జిల్లా కేంద్రంలో ఉన్న అన్ని పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ఉండటంతో పాటు ప్రజలు కుటుంబాలతో కలిసి స్వగ్రామాలకు మరియు వివిధ ప్రాంతాలకు ప్రయాణాలు చేసే అవకాశం ఉంది.ఈ సమయంలో ప్రధాన రహదారులపై వాహనాల రద్దీ గణనీయంగా పెరిగే అవకాశం ఉన్నందున, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఈ నెల 10వ తేదీ నుండి 21వ తేదీ వరకు ఇసుక లారీల రాకపోకలను, ఇసుక లోడింగ్ మరియు రవాణాను తాత్కాలికంగా నిలిపివేయాలని మంగపేట మండల ప్రజల నుండి అనేక విన్నపాలు అందుతున్నాయి.ఇటీవల రహదారులపై తరచూ



ప్రమాదాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో పండుగ సెలవుల సమయంలో వాహనాల రద్దీ మరింత పెరిగితే ప్రమాదాల అవకాశాలు కూడా పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా కుటుంబాలతో ప్రయాణించే ప్రజలు, మహిళలు, చిన్నపిల్లలు మరియు వృద్ధుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యలు తీసుకోవడం అవసరం.ఈ విషయంపై గ్రామస్తులతో చర్చించిన అనంతరం, ప్రజల భద్రత కోసం పండుగ సెలవుల సమయంలో ఇసుక లారీల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేయాలని మంగపేట మండల ప్రజల తరఫున



నిర్ణయించుకున్నాము.కావున, మా వినతిని సానుకూలంగా పరిశీలించి, 10వ తేదీ నుండి 21వ తేదీ వరకు ఇసుక లారీల రాకపోకలు మరియు ఇసుక రవాణా నిలిపివేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని మనవి చేస్తు శుక్రవారం మండల కేంద్రంలోని తహసిల్దార్ తోట రవీందర్ కు జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ తరఫున వినతి పత్రం అందజేశారు. అనంతరం మంగపేట మండలం పోలీస్ స్టేషన్ లో ఇసుక లారీలను నియంత్రించాలని వినతి పత్రాన్ని అందజేశారు..

పూల పండుగలో పసిపాపల సందడి..!

ప్రభుత్వ బడిలో బతుకమ్మ సంబరాలు..

వెంకటాపురం . నూగూరు. ములుగు జిల్లా అక్టోబర్ 09(సూర్యోదయ వార్త.)

దసరా సెలవుల సందర్భంగా ములుగు జిల్లా





వెంకటాపురం మండలం ఎంపీపీఎస్ మరికాల కొత్తూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలు, సంప్రదాయ దుస్తుల్లో ముస్తాబైన చిన్నారులతో పాఠశాల ప్రాంగణం పూలవనాన్ని తలపించింది. విద్యార్థినుల సందడి, బతుకమ్మల అందాలతో పాఠశాలలో పండుగ వాతావరణం నెల కొంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్ప తనాన్ని విద్యార్థులకు తెలియజేస్తూ, చదువుతో పాటు మన పండుగలు, ప్రకృతి పరిరక్షణ పట్ల అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ వేడుకలను నిర్వహించారు. ఇలాంటి కార్యక్రమాలు చిన్నారుల్లో మన సంస్కృతి పట్ల మమకారాన్ని, ఐకమత్యాన్ని పెంపొంది స్తాయని ఉపాధ్యాయుడు విజయ్ సార్ తెలిపారు.“మన బడి.. మన సంస్కృతి.. మన తెలంగాణ.. మన బతుకమ్మ!” అనే సందేశంతో వేడుకలు ఆనందోత్సాహాల మధ్య ముగిశాయి..

జాతీయ రహదారిపై పోలీసుల ముమ్మర తనిఖీలు..

- ఇకపై ప్రతిరోజు తనిఖీలు చేపడతాం..
- పసర -ఎస్సై తాజుద్దీన్



గోవిందరావుపేట. పస్రా. అక్టోబర్ 09(సూర్యోదయ వార్త.)

ములుగు– ఏటూరు నాగారం 163 జాతీయ రహదారిపై శుక్రవారం పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. ములుగు జిల్లా ఎస్పీ. సుధీర్ రామ్నాథ్ కేక న్ ఆదేశాల మేరకు ఎస్సై తాజుద్దీన్ ఆధ్వర్యంలో లారీ డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. స్పీడ్ లిమిట్ దాటి వేగంగా వెళ్తున్న వాహనాలను గుర్తించి. కేసులు నమోదు చేశారు. ఇకపై ప్రతిరోజు తనిఖీలు నిర్వహిస్తామని ఎస్ఐ తెలిపారు

బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి సీతక్క..!

- తెలంగాణ సంస్కృతికి బతుకమ్మ ప్రతీక..
- ఆడబిడ్డల ఆత్మగౌరవానికి నిలువెత్తు నిదర్శనం..
- ప్రతి ఇంటా ఆనందం.. ప్రతి ఆడబిడ్డ జీవితంలో కొత్త వెలుగులు నిండాలి: మంత్రి సీతక్క



ములుగు, అక్టోబర్ 09:(సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

తెలంగాణ ఆడబిడ్డలతో పాటు రాష్ట్ర ప్రజలందరికీ రాష్ట్ర మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తూ, ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని చాటిచెబుతుందని పేర్కొన్నారు. కులమతాలకు, పేదధనిక తేడాలకు అతీతంగా ప్రజలందరినీ ఒక్కతాటిపైకి తీసుకొచ్చే గొప్ప పండుగ బతుకమ్మ అని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ ఆత్మగౌరవంతో జీవించాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రకృతితో ముడిపడిన బతుకమ్మ పండుగ స్ఫూర్తితో చెరువులు, పర్యావరణాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ బతుకమ్మ పండుగ ప్రతి ఇంటా ఆనందాన్ని, ప్రతి ఆడబిడ్డ జీవితంలో సరికొత్త వెలుగులను నింపాలని మంత్రి సీతక్క ఆకాంక్షించారు..

వెంకటాపురంలో ఘనంగా కాన్షీరాం వర్ధంతి వేడుకలు..

- బహుజన రాజ్యాధికార సాధనకు కాన్షీరాం జీవితం స్ఫూర్తి..
- మహనీయుడి ఆశయాల సాధనకు బహుజనులు కృషి చేయాలి:
- యాసం రమేష్ మాదిగ..



వెంకటాపురం(నూగూర్), అక్టోబర్ 09(సూర్యోదయ వార్త.)

ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలోని ఆర్అండ్బీ గెస్ట్హౌస్ ఆవరణలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మాన్యశ్రీ కాన్షీరాం వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటాపురం మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు యాసం రమేష్ మాదిగ మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, బహుజనుల రాజకీయ చైతన్యానికి మార్గదర్శకుడు కాన్షీరాం అని కొనియాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను చైతన్యవంతులను చేస్తూ ఎన్నో ఉద్యమాలు నిర్వహించి, బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ)ని స్థాపించి బహుజన రాజ్యాధికార సాధనకు కృషి చేసిన మహనీయుడని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని బహుజనుల హక్కులు, అభివృద్ధి, రాజకీయ సాధికారత కోసం ప్రతి ఒక్కరూ నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు వేల్పుల మల్లేష్ మాదిగ, యాసం మహేష్ మాదిగ, ఎంఎస్పీ మండల అధ్యక్షుడు కొడారి సత్యం మాదిగ, ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షుడు చెన్నం తిరుపతి మాదిగ, కాట మహేష్ తదితరులు పాల్గొన్నారు..

విద్యుత్ షాక్ తో వృద్ధురాలు మృతి..

తాడ్వాయి. ములుగు జిల్లా అక్టోబర్ 09- (సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)



ములుగు జిల్లా తాడ్వాయి మండలం నర్సింగాపూర్ లో శుక్రవారం కరెంట్ షాక్ తో మృతి చెందిన విషాద ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దసరా పండుగ కోసం ఇంటిని శుభ్రం చేస్తుండగా ప్రమాశాత్తు విద్యుత్ తీగలు తగలడంతో షాక్ కు గురై పిట్టల ప్రమీల (69) అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుమార్తె స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాడ్వాయి ఎస్సై తెలిపారు..

జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో కేజీబీవీ ఏటూరునాగారం విద్యార్థినుల విజయదుందుభి!

- ఎస్జీఎఫ్ఐ, అథ్లెటిక్స్ పోటీల్లో పతకాల పంట..
- సత్తా చాటిన గిరిజన బాలికలు!
- చదువుతో పాటు క్రీడల్లోనూ అగ్రగామి..
- ఏటూరునాగారం కేజీబీవీ విద్యార్థినులకు అభినందనలు!.



ఏటూరునాగారం, అక్టోబర్ 9:.(సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)


ములుగు జిల్లా స్థాయిలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్జీఎఫ్ఐ) క్రీడా పోటీలతో పాటు అథ్లెటిక్స్ పోటీల్లో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) ఏటూరునాగారం విద్యార్థినులు అద్భుత ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధించారు. క్రీడల్లో తమ ప్రతిభను చాటుతూ పాఠశాలకు మంచి పేరు తీసుకురావడంతో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 28, 29 తేదీల్లో నిర్వహించిన జిల్లా స్థాయి ఎస్జీఎఫ్ఐ స్కూల్ గేమ్స్‌లో జూనియర్ విభాగంలో వాలీబాల్‌లో ద్వితీయ స్థానం, కబడ్డీ, ఖోఖోలో ప్రథమ స్థానాలు సాధించగా, షాట్‌పుట్‌లో ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. సబ్‌జూనియర్ విభాగంలో ఖోఖోలో ప్రథమ స్థానం, వాలీబాల్, కబడ్డీ పోటీల్లో ద్వితీయ స్థానాలు సాధించి విద్యార్థినులు తమ క్రీడా ప్రతిభను నిరూపించుకున్నారు. అలాగే అక్టోబర్ 4న ములుగు జిల్లా బండారుపల్లిలో నిర్వహించిన జూనియర్, సబ్‌జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లోనూ కేజీబీవీ విద్యార్థినులు పలు పతకాలు సాధించారు. జావెలిన్ త్రో, షాట్‌పుట్, రన్నింగ్ తదితర విభాగాల్లో గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ పతకాలు సాధించి విజయాన్ని అందుకున్నారు. విద్యార్థినులు క్రీడల్లో సాధించిన విజయాల పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుణ, పీఈటీ స్వరూప, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు. విద్యతో పాటు క్రీడల్లోనూ విద్యార్థినులను ప్రోత్సహించడం ద్వారా వారి ప్రతిభ వెలుగులోకి వస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని పోటీల్లో పాల్గొని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అరుణ, పీఈటీ స్వరూప, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



చిన్నారుల సంక్షేమం, ఆరోగ్య సేవలపై ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో ప్రత్యేక దృష్టి.

ఏటూరు నాగారం. ములుగు జిల్లా. అక్టోబర్ 09(సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

ఏ టూరునాగారం: గిరిజన ప్రాంతాల్లో చిన్నారుల సంక్షేమం, పౌష్టికాహారం, ప్రాథమిక ఆరోగ్య సేవల నాణ్యతను మెరుగుపరిచే లక్ష్యంతో ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో శుక్రవారం చినబోయినపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రం, సబ్ సెంటర్‌ను సందర్శించి పరిశీలించారు.అంగన్‌వాడీ కేంద్రంలో అందుబాటులో ఉన్న వసతులు, చిన్నారులకు సంబంధించిన ఏర్పాట్లు, కేంద్రం నిర్వహణ వివరాలను పరిశీలించారు. చిన్నారుల ఎదుగుదలకు పౌష్టికాహారం, ప్రాథమిక విద్య, పరిశుభ్రమైన వాతావరణం ఎంతో ముఖ్యమని, అంగన్‌వాడీ సేవలు నాణ్యతతో అందేలా సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.అనంతరం సబ్ సెంటర్‌ను సందర్శించిన పీఓ, ఆరోగ్య రికార్డులు, మందుల నిల్వలు, వైద్య పరికరాలు, ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అవసరమైన ఆరోగ్య సేవలు సకాలంలో అందేలా చూడాలని, మందుల లభ్యత, రికార్డుల నిర్వహణపై శ్రద్ధ వహించాలని సూచించారు. క్షేత్రస్థాయి సందర్శనల ద్వారా ప్రభుత్వ సేవల అమలును పరిశీలిస్తూ, గిరిజన ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఐటీడీఏ కృషి చేస్తోంది. చిన్నారుల సంక్షేమం, ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన సేవలు సమర్థవంతంగా అమలయ్యేలా సంబంధిత శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్శన ప్రాధాన్యతను తెలియజేస్తోంది...





ప్రకృతిని కాపాడడమే హైడ్రా లక్ష్యం..

: సకల జీవకోటికీ ప్రాణాధారమైన జలవనరులను కాపాడుకున్నప్పుడే భవిష్యత్ తరాలకు ఆరోగ్యమైన జీవనాన్ని అందించగలమని హైడ్రా కమిషనర్ ఏవీ.రంగనాథ్ చెప్పారు. ఈ క్రమంలో చెరువుల పునరుద్ధరణ కార్యక్రమాన్నిహైడ్రా పెద్దఎత్తున చేపట్టిందన్నారు. ఇప్పటికే 6 చెరువుల పనులు పూర్తవ్వగా.. మరో 14 చెరువులను హైడ్రా రెండో దశలో చేపట్టామన్నారు. నగరంలో చెరువులు, కాలువలను పరిరక్షించి భవిష్యత్ తరాలకు వరదలు లేని, పర్యావరణ హితమైన నగరాన్ని అందించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఆ లక్ష్యాన్ని చేరుకునే క్రమంలో అనేక సవాళ్లు ఎదురైనా.. హైడ్రా ముందుకెళ్తోందన్నారు. పర్యావరణ పునరుద్ధరణ, పరిశ్రమలు– నిబంధనాధికారుల పాత్రపై సీఎస్ఐఆర్ – ఐఐసీటీలో జరిగిన జాతీయ సదస్సులో హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడారు. ఎన్ఆర్ఎస్సీ లెక్కల ప్రకారం నగరంలో 61 శాతం చెరువులు కనుమరుగవ్వగా.. మిగతావి ఆక్రమణలకు గురై ఉనికిని కోల్పోయాని చెప్పారు. ఇలాంటి దశలో ఆక్రమణలు తొలగించడం ఒకెత్తయితే.. అందులో 5 నుంచి 6 మీటర్ల మేర పేరుకుపోయిన పూడికను తొలగించడం మరో సవాల్‌గా మారిందన్నారు.

చెరువు ఆనవాళ్లు లేని బతుకమ్మకుంటను తవ్వి ఆ పరిసరాల్లో వరద లేకుండా చేశామన్నారు. మాధాపూర్‌లో తమ్మిడికుంట, సున్నం చెరువు ఇలా నగరంలో ఏ చెరువును చూసినా దుర్గంధభరితంగా.. పరిసర ప్రాంతాల ప్రజల ఆరోగ్యానికి హానికరంగా మారాయని చెప్పారు. అలాంటి వాటిని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి పర్యావరణ పరిరక్షణకు పెద్ద పీట వేస్తున్నామన్నారు. చెరువుల చుట్టూ పార్కులు,ప్లే ఏరియాలు, ఔషధ గుణాలున్న మొక్కలను నాటి అక్కడ ఆహ్లాదకరమైన వాతావరణాన్ని సృష్టిస్తున్నామన్నారు. హైడ్రా అభివృద్ధి చేయకముందు చెరువులు ఎలా ఉండేవి.. తర్వాత ఎలా మారాయనేది పవర్ పాయింట్ ప్రదర్శన ద్వారా హైడ్రా కమిషనర్ ఈ సందర్భంగా చూపించారు. పాతబస్తీలోని బమ్రుకున్ ఉద్ దౌలా చెరువు ఆక్రమణలకు గురై 4.5 ఎకరాలకు పరిమితమవ్వగా.. ఇప్పుడా చెరువును 17.5 ఎకరాలకు విస్తరించామని చెప్పారు. ఇలానే మిగతా చెరువులలో ఆక్రమణలు తొలగించి విస్తరించామన్నారు.

ప్రకృతి పరిరక్షణ ఎలానో చెరువుల పునరుద్ధరణతో పాటు.. పార్కులు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణతో హైడ్రా ప్రాక్టికల్‌గా చేసి చూపిస్తోందని సదస్సుకు హాజరైన పద్మశ్రీ పురస్కార గ్రహీత, వ్యూహాత్మక సలహాదారు, ది హిమాలయ ఇనిషియేటివ్, అశోకా ట్రస్ట్ ఫర్ రీసెర్చ్ ఇన్ ఎకాలజీ అండ్ ది ఎన్విరాన్‌మెంట్ (ఏటీఆర్ఈఈ) డైరెక్టర్ డా. ఎకలవ్య శర్మ, సీఎస్ఐఆర్–ఐఐసీటీ డైరెక్టర్ డా. శ్రీనివాసరెడ్డితో పాటు పలువురు వక్తలు ఈ సందర్భంగా కొనియాడారు. ఇన్‌లెట్లు, ఔట్‌లెట్లు.. ఇలా ప్రతి చెరువుకు ఉండే సహజసిద్ధమైన లక్షణాలను కాపాడుతూ వాటిని పునరుద్ధరించడం ఆచరణీయంగా ఉందన్నారు. చెరువుల్లో నీళ్లు కలుషితం కాకుండా చూస్తే.. జీవవైవిధ్యానికి పెద్ద పీట వేసినట్టేనన్నారు. కొన్నేళ్ల పాటు ఇదే నిబద్ధతతో పని చేస్తే హైదరాబాద్ నగరానికి ప్రకృతిపరంగా మంచి భవిష్యత్తు ఇచ్చినట్టవుతుందని చెప్పారు. వాతావరణంలో వచ్చిన పెనుమార్పులతో హిమాలయాల మంచు కరగడం, నేపాల్‌లో వరదలు.. ఇలా ప్రకృతి వైపరీత్యాలకు గల కారణాలను ఈ సదస్సులో పాల్గొని పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన పలు అంశాలను చర్చించారు.



తెలుగు దినపత్రిక
సూర్యోదయ వార్త
ప్రతి అక్షరం ప్రజల కోసం...

ఉల్లిగడ్డ పాట్టులో ఉన్న లాభాలు...!



ఉల్లిపాయ పొట్టుతో ఎన్నో లాభాలున్నాయి. సాధారణంగా మనం ఇవి పనికిరావని భావించి పారవేస్తాం. కానీ ఈ ఉల్లిపాయ పొట్టు లేదా తొక్కలు ఇంటి పనుల్లో, అందం సంరక్షణలో, తోటపనుల్లో చాలా ఉపయోగపడతాయి. ఉల్లిపాయ పొట్టులో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, అనేక పోషకాలు ఉంటాయి. అందుకే ఇవి ఆరోగ్యానికి, రోజువారీ ఉపయోగాలకు సహాయపడతాయి. ప్రతిరోజూ వంటగదిలో చాలా కూరగాయలు, పండ్ల తొక్కలు, ఇతర వ్యర్థాలు జమ అవుతాయి. చాలామంది వాటిని పనికిరావని భావించి చెత్తబుట్టలో వేస్తారు. కానీ, నిజానికి వాటిలో కూడా అనేక ప్రయోజనాలు దాగి ఉంటాయి. అలాంటివాటిలో ఉల్లిపాయ పొట్టు కూడా ఒకటి. సాధారణంగా మనం ఇవి పనికిరావని భావించి పారవేస్తాం. కానీ ఈ ఉల్లిపాయ పొట్టు లేదా తొక్కలు ఇంటి పనుల్లో, అందం సంరక్షణలో, తోటపనుల్లో చాలా ఉపయోగపడతాయి. ఉల్లిపాయ పొట్టులో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, అనేక పోషకాలు ఉంటాయి. అందుకే ఇవి ఆరోగ్యానికి, రోజువారీ ఉపయోగాలకు సహాయపడతాయి. 1. సహజ ఎరువుగా.. ఉల్లిపాయ తొక్కలను సహజ ఎరువుగా ఉపయోగించవచ్చు. ఇవి మొక్కల పెరుగుదలకు సహాయపడతాయి. తొక్కలను నీటిలో నానబెట్టి ఆ నీటిని మొక్కలకు పోస్తే ఆకులు పచ్చగా, ఆరోగ్యంగా పెరుగుతాయి. 2. జుట్టు సంరక్షణకు.. ఉల్లిపాయ తొక్కలు జుట్టుకు కూడా ఎంతో మేలు చేస్తాయి. ఒక గిన్నెలో నీరు తీసుకుని ఉల్లిపాయ తొక్కలను వేసి మరిగించాలి. చల్లారిన తర్వాత ఆ నీటిని జుట్టుకు అప్లై చేయడం వల్ల జుట్టు మెరిసేలా, బలంగా, మందంగా మారుతుంది. 3. టీగా.. కొంతమందికి మాత్రమే తెలిసిన విషయం ఏమిటంటే.. ఉల్లిపాయ తొక్కలతో టీ కూడా తయారు చేయవచ్చు. ఈ టీ తాగడం వల్ల ఊబకాయం తగ్గడంలో సహాయపడుతుంది. అలాగే అలెర్జీలు, ఇన్ఫెక్షన్లు, అధిక రక్తపోటు సమస్యల నుంచి ఉపశమనం పొందడంలో కూడా ఉపయోగపడుతుంది. 4. చర్మ సంరక్షణకు.. ఉల్లిపాయ తొక్కలలో ఉండే యాంటీఆక్సిడెంట్లు చర్మానికి మేలు చేస్తాయి. తొక్కలను నీటిలో మరిగించి, చల్లారిన తర్వాత ఆ నీటిని చర్మానికి అప్లై చేస్తే చర్మం తాజాగా కనిపిస్తుంది. ఉల్లిపాయ తొక్కలను ఇంటి శుభ్రపరచడంలో కూడా ఉపయోగించవచ్చు. తొక్కలను నీటిలో మరిగించి ఆ నీటితో వంటగదిని లేదా ఇంటిని శుభ్రం చేస్తే దుర్వాసనలు తొలగిపోతాయి. దీనిని ప్రతిరోజూ కూడా ఉపయోగించవచ్చు.

వ్యాయామం చేయకుండానే బరువు తగ్గొచ్చు!

నేటి కాలంలో చక్కెర లేనిదే మన రోజు గడవదు. ఉదయం తాగే టీ, కాఫీ నుంచి రాత్రి తినే స్వీట్ల వరకు ప్రతి దాంట్లోనూ పంచదార ఒక అంతర్భాగమైపోయింది. అయితే, ఈ తీపి పదార్థాలు శరీరానికి చేసే నష్టం అంతా ఇంతా కాదు. అధిక బరువు, టైప్-2 డయాబెటిస్, గుండె సంబంధిత సమస్యలు మరియు దంత క్షయానికి చక్కెర ప్రధాన కారణం. మరి కేవలం ఆహారంలో చక్కెరను పక్కన పెడితే ఎంత బరువు తగ్గొచ్చో తెలుసా? బరువు తగ్గాలని కఠినమైన వర్కౌట్లు చేస్తున్నా ఫలితం రావడం లేదా? అయితే మీరు తీసుకునే తీపి పదార్థాలపై ఒక్కసారి కన్నేయండి.

డాక్టర్ సుధీర్ కుమార్ ఒక 40 ఏళ్ల వ్యక్తిని ఉదాహరణగా తీసుకుని ఈ లెక్కలు వివరించారు. కేవలం పైన చెప్పిన ఆహార పదార్థాలను మానేయడం ద్వారా, సదరు వ్యక్తి నెలకు సుమారు 1.5 కిలోల బరువు తగ్గుతారని డాక్టర్ సుధీర్ కుమార్ తెలిపారు. ఏ విధమైన కొత్త వ్యాయామాలు చేయకుండానే ఏడాదికి సుమారు 18 కిలోల బరువు తగ్గే అవకాశం ఉంటుంది. లిక్విడ్ క్యాలరీల (సాఫ్ట్ డ్రింక్స్, జ్యూస్) వల్ల కడుపు నిండిన అనుభూతి కలగదు. వీటిని చాలా త్వరగా తాగేయొచ్చు, దీనివల్ల మనం తెలియకుండానే ఎక్కువ క్యాలరీలను శరీరానికి ఇస్తాం.

అందుకే ఇవి బరువు పెరగడానికి, డయాబెటిస్ మరియు ఫ్యాటీ లివర్ వ్యాధి రావడానికి ప్రధాన కారణమవుతున్నాయి. బయట దొరికే ఆహార పదార్థాలు కొనేముందు వాటిపై ఉండే న్యూట్రిషన్ లేబుల్స్ చదవండి. సాధ్యమైనంత వరకు సహజమైన పండ్లనే తినండి, రసాలు కాదు.చక్కెరను తగ్గించడం వల్ల శరీరంలో ఎనర్జీ లెవల్స్ కూడా బ్యాలెన్స్‌డ్‌గా ఉంటాయి. చక్కెరను మానేయడం అనేది కేవలం బరువు తగ్గడానికే కాదు, దీర్ఘకాలిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి కూడా ఎంతో ముఖ్యం. అయితే ఈ లెక్కలు అందరికీ ఒకేలా ఉండకపోవచ్చు. కాబట్టి మీ వయస్సు, ఆరోగ్య స్థితిని బట్టి సరైన డైట్ ప్లాన్ కోసం నిపుణులను సంప్రదించడం మంచిది.



బొప్పాయి తింటే..!



బొప్పాయి పండు ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. ఈ పండులో విటమిన్లు ఎ, సి, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ముఖ్యంగా వేసవిలో ఈ పండు తినడం శరీరాన్ని చాలా చల్లగా ఉంచుతుంది. అందుకే చాలా మంది ఈ పండును తీసుకుంటారు. కానీ బొప్పాయి పండు తినడానికి ఎప్పుడు ఉత్తమ
సమయమో చాలా మందికి తెలియదు. బొప్పాయి పండు ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. ఈ పండులో విటమిన్లు ఎ, సి, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ముఖ్యంగా వేసవిలో ఈ పండు తినడం శరీరాన్ని చాలా చల్లగా ఉంచుతుంది. అందుకే చాలా మంది ఈ పండును తీసుకుంటారు.


కానీ బొప్పాయి పండు తినడానికి ఎప్పుడు ఉత్తమ సమయమో చాలా మందికి తెలియదు. బొప్పాయిలో కార్బోహైడ్రేట్లు, ఫైబర్, ప్రోటీన్, విటమిన్ సి, విటమిన్ ఎ, విటమిన్ బి9, పొటాషియం, మెగ్నీషియం, కాల్షియం, విటమిన్ బి1, విటమిన్ బి3, విటమిన్ బి5, విటమిన్ ఇ, విటమిన్ కె వంటి ముఖ్యమైన పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి జీర్ణక్రియ, జుట్టు, చర్మానికి మేలు చేస్తాయి. ఉదయం ఖాళీ కడుపుతో లేదా అల్పాహారం సమయంలో బొప్పాయి పండును తినడం ఉత్తమం. ఇది రోజంతా జీర్ణ వ్యవస్థలో సమతుల్యతను కాపాడుకోవడానికి సహాయపడుతుంది. అలాగే, బొప్పాయి ప్రేగులను నిర్విషీకరణ చేస్తుంది కాబట్టి, రాత్రిపూట కూడా తినవచ్చు. కానీ భోజనం తర్వాత కనీసం 3 నుంచి 4 గంటల వరకు పండ్లు తినకుండా జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే భోజనం చేసిన వెంటనే తినడం వల్ల జీర్ణవ్యవస్థకు అంతరాయం కలుగుతుంది. బొప్పాయిలో పపైన్ అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది ప్రోటీన్‌ను జీర్ణం చేయడంలో సహాయపడుతుంది. అల్పాహారంగా బొప్పాయి తినడం వల్ల జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. మలబద్ధకం, గ్యాస్, ఆమ్లత్వం వంటి సమస్యలను నివారిస్తుంది. బొప్పాయిలో ఫైబర్ కూడా పుష్కలంగా ఉంటుంది. ఇది పేగులను శుభ్రపరుస్తుంది. కడుపును తేలికగా ఉంచుతుంది. రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడుతుంది. బొప్పాయి విటమిన్ సి రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. ఉదయం ఖాళీ కడుపుతో బొప్పాయి తినడం వల్ల శరీరానికి ఇన్ఫెక్షన్లు, వ్యాధులతో పోరాడటానికి శక్తి లభిస్తుంది. ఇది జలుబు, వైరల్ ఇన్ఫెక్షన్లు, ఇతర వ్యాధుల నుండి రక్షించడంలోనూ సహాయపడుతుంది. బొప్పాయి పండు ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. ఈ పండులో విటమిన్లు ఎ, సి, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ముఖ్యంగా వేసవిలో ఈ పండు తినడం శరీరాన్ని చాలా చల్లగా ఉంచుతుంది. అందుకే చాలా మంది ఈ పండును తీసుకుంటారు.

మధ్యాహ్నం నిద్రపోతే శరీరంలో ఏం జరుగుతుంది?



చాలా మందికి మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత కాసేపు అలా కనుకు తీయడం అలవాటు. కొందరు దీన్ని సోమరితనంగా భావిస్తే మరికొందరు అలసటను తగ్గించుకునే మార్గంగా చూస్తారు. అయితే మధ్యాహ్నం నిద్ర అందరికీ ఒకేలా పని చేయదని, అది మనం నిద్రపోయే సమయం, వ్యవధిపై ఆధారపడి ఉంటుందని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఢిల్లీకి చెందిన డాక్టర్ అజయ్ కుమార్ విశ్లేషణ ప్రకారం..
మధ్యాహ్నం పూట 20 నుండి 30 నిమిషాల
చిన్న విశ్రాంతి వల్ల పని సామర్థ్యం, ఏకాగ్రత మెరుగుపడతాయి. రాత్రి నిద్ర సరిగ్గా లేని వారికి లేదా శారీరక శ్రమ అధికంగా చేసే వారికి ఈ చిన్న నిద్ర రీఛార్జ్‌లా పనిచేస్తుంది. మనస్సును ప్రశాంతంగా ఉంచి, మిగిలిన రోజంతా ఉత్సాహంగా గడిపేలా చేస్తుంది. గంట దాటితే ముప్పే: మధ్యాహ్నం నిద్ర ప్రయోజనకరమే అయినప్పటికీ అది గంట దాటితే మాత్రం అనర్థాలు తప్పవని వైద్యులు హెచ్చరిస్తున్నారు. గంట కంటే ఎక్కువ నిద్రపోతే లేచిన తర్వాత తలనొప్పి, బద్ధకం, శరీరం బరువుగా అనిపించడం వంటి సమస్యలు వస్తాయి.

ఒక్క ఇన్‌స్టా పోస్ట్‌కే అన్ని లక్షలా!.....



ఒకప్పుడు హీరో హీరోయిన్ల సంపాదన అంటే సినిమాల రెమ్యూనరేషన్, బ్రాండ్ ప్రకటనలు మాత్రమే గుర్తుకు వచ్చేవి. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. సోషల్ మీడియాలో లక్షలాది మంది అభిమానులను సంపాదించుకున్న సెలబ్రిటీలు ఇప్పుడు తమ డిజిటల్ ప్రభావాన్ని కోట్ల రూపాయల ఆదాయంగా మార్చుకుంటున్నారు. ఈ కొత్త ట్రెండ్‌లో అగ్రస్థానంలో నిలుస్తున్న వారిలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ జాన్వీ కపూర్ ఒకరు. శ్రీదేవి వారసురాలిగా వెండితెరకు పరిచయమైన ఆమె, ఇప్పుడు సినిమాలతో పాటు సోషల్ మీడియా ద్వారా కూడా భారీ ఆదాయాన్ని ఆర్జిస్తోంది. జాన్వీ కపూర్‌కు ఇన్‌స్టాగ్రామ్‌లో 2.68 కోట్లకు పైగా ఫాలోవర్లు ఉన్నారు. ఎక్స్ వంటి ఇతర సోషల్ మీడియా వేదికల్లో కూడా ఆమెకు విశేష ఆదరణ ఉంది. ఈ ఫ్యాన్ ఫాలోయింగ్‌ను, ఒక బిజినెస్ గా మలచుకోవడంలో ఆమె సక్సెస్ అయ్యారు. ప్రస్తుతం దేశీయ, అంతర్జాతీయ స్థాయి బ్రాండ్లు తమ ఉత్పత్తుల బ్రాండ్ అంబాసిడర్ గా జాన్వీ కపూర్‌ను ఎంపిక చేసుకోవడానికి ఆసక్తి చూపుతున్నాయి. దీంతో ఆమె సోషల్ మీడియా అకౌంట్లు ప్రముఖ కంపెనీలకు అత్యంత విలువైన డిజిటల్ ప్రమోషన్ వేదికలుగా మారాయి. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, జాన్వీ కపూర్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో చేసే ఒక్క ప్రమోషనల్ పోస్ట్ కోసం సుమారు రూ.7 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పారితోషికం అందుకుంటున్నట్లు తెలుస్తోంది. అలాగే ఎక్స్ వేదికపై చేసే ఒక్కో బ్రాండెడ్ పోస్టుకూ లక్షల్లోనే చార్జ్ చేస్తున్నట్లు ప్రచారం ఉంది. కేవలం పోస్టులు మాత్రమే కాకుండా, ప్రముఖ బ్రాండ్లతో ఒప్పందాలు కూడా ఆమె ఆదాయాన్ని మరింత పెంచుతున్నాయి. ఒప్పో, లెన్స్‌కార్ట్, తుమి, హావెల్స్ వంటి ప్రముఖ సంస్థలకు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న ఆమె, ఈ ఒప్పందాల ద్వారా ఏడాదికి కోట్లల్లోనే సంపాదిస్తున్నట్లు సినీ, మార్కెటింగ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రతి నెల లైఫ్ స్టైల్, బ్యూటీ, ఫ్యాషన్, గ్యాడ్జెట్స్, టెక్నాలజీ ఉత్పత్తులకు సంబంధించిన అనేక బ్రాండ్ ప్రమోషన్లు ఆమె సోషల్ మీడియా ఖాతాల్లో కనిపిస్తుంటాయి.

శ్రద్ధ 'ఈఠ'కు ఊరట.. మద్దతుగా నిలిచిన ఫ్యామిలీ..!



శ్రద్ధా కపూర్ ప్రధాన పాత్రలో, లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో రాబోతున్న చిత్రం 'ఈఠ'. మరాఠీ 'లవాణి' కళాకారిణి 'విఠాబాయి నారాయణ్ గావ్‌కర్' జీవితం ఆధారంగా తెరకెక్కుతున్న ఈ బయోపిక్ నుంచి జూన్ 23న టీజర్ విడుదలై వివాదంలో చిక్కుకుంది. 'ఈఠ' టైటిల్ పేరుపై రాజకీయపార్టీ ఎన్‌సీపీ, విఠాబాయి కుటుంబ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. విఠాబాయి మహారాష్ట్రకు చెందిన గొప్ప జానపద కళాకారిణి. ఆమె జీవితం ఆధారంగా వస్తోన్న ఈ సినిమాకు ఆమె పేరే ఉండాలి అని సూచించారు. అయితే తాజాగా శ్రద్ధాకపూర్ నటిస్తున్న 'ఈఠ'కు ప్రముఖ లావణి కళాకారిణి విఠాబాయి నారాయణ్ గావ్‌కర్ కుమార్తె మంగళా బన్సోడే కరవడికర్ మద్దతు తెలిపారు. ''ఈఠ' టైటిల్ విషయంలో మా కుటుంబానికి ఎలాంటి అభ్యంతరం లేదు. ఈ టైటిల్ చాలా సముచితమైనది, ఎందుకంటే మా అమ్మ ప్రదర్శనలు ఇచ్చిన గ్రామాల్లోని ప్రజలు ఆమెను తరచుగా 'ఈఠ' అని పిలిచేవారు' అని తెలపగా.. మొత్తానికి ఈ సినిమాకు ఊరట కలిగినట్లు అయింది.

ఆ స్టార్ హీరో వల్ల నాకు గుర్తింపు వచ్చింది..



యంగ్ హీరోయిన్ శ్రద్ధా దాస్ తెలుగుతో పాటు హిందీ, తమిళ, కన్నడ భాషల్లో వైవిధ్యమైన పాత్రలు చేస్తూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు . మరీ ముఖ్యంగా టాలీవుడ్‌లో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ సరసన 2009లో వచ్చిన 'ఆర్య-2' సినిమాలో నటించి ప్రేక్షకులను మెప్పించారు. ఆ తర్వాత తెలుగులో పలు చిత్రాల్లో నటించినప్పటికీ ఆశించిన స్థాయిలో హిట్లు రాకపోవడంతో ఇక్కడ అవకాశాలు తగ్గాయి. దీంతో ఆమె బాలీవుడ్ వైపు అడుగులు వేశారు. ప్రస్తుతం హిందీలో వరుస ప్రాజెక్టులు చేస్తూ బిజీగా మారిన శ్రద్ధా దాస్, ఇటీవల 'త్రికాల' అనే మైథలాజికల్ థ్రిల్లర్ మూవీతో ప్రేక్షకులను అలరించారు. ఈ నేపథ్యంలో తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న శ్రద్ధా దాస్, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. అల్లు అర్జున్‌కు ఉన్న క్రేజ్, పాపులారిటీ గురించి ఆమె చాలా ఆసక్తికరమైన విషయాలు పంచుకున్నారు. అల్లు అర్జున్ సినిమాలకు తెలుగులోనే కాకుండా మిగతా భాషల్లో కూడా ఏ రేంజ్‌లో ఆదరణ ఉంటుందో శ్రద్ధా దాస్ గుర్తుచేసుకున్నారు. బన్నీ నటించిన చిత్రాలకు తమిళం, మలయాళంలోకి డబ్ అయినప్పుడు కూడా అక్కడ థియేటర్లు హౌస్‌ఫుల్ అవుతాయని ఆమె చెప్పారు. దక్షిణాదిలోనే కాకుండా, ఉత్తరాదిలోకూడా ఆయన డబ్బింగ్ సినిమాలకు విపరీతమైన క్రేజ్ ఉందని తెలిపారు. అల్లు అర్జున్ చిత్రాల వల్లే తనకు నార్త్ ఇండియాలో కూడా మంచి గుర్తింపు లభించిందని ఆమె సంతోషం వ్యక్తం చేశారు.

రియా శింబుకు కోలీవుడ్‌లో మరో బంపర్ ఆఫర్!



యంగ్ బ్యూటీ రియా శింబు తమిళ, మలయాళ చిత్రాలతో నటిగా, నిర్మాతగా తనదైన ముద్ర వేశారు. 'కప్' మూవీతో హీరోయిన్‌గా ఇండస్ట్రీకి వచ్చిన ఆమె 'సర్వం మాయ' సినిమాతో ఫుల్ ఫేమ్ రాబట్టుకున్నారు. ఇండస్ట్రీకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే ఊహించని క్రేజ్ రాబట్టుకున్న రియా ప్రస్తుతం తమిళంలో మోస్ట్ వాంటెడ్ బ్యూటీగా మారిపోయారు. ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ హీరో చియాన్ విక్రమ్ సరసన చియాన్-63 ప్రాజెక్ట్‌లో హీరోయిన్‌గా నటిస్తున్నారు. దర్శకుడు ఆనంద శంకర్ తెరకెక్కిస్తున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను సత్యజ్యోతి ఫిలిమ్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. 60 ఏళ్ల విక్రమ్‌తో 21ఏళ్లున్న రియా శింబు రొమాన్స్ చేస్తుండటం విశేషం. చియాన్ విక్రమ్ సినిమాతో పాటు, తాజాగా రియా శింబు కోలీవుడ్‌లో మరో లక్కీ ఆఫర్ దక్కించుకున్నట్లు టాక్ . టాలెంటెడ్ యాక్టర్, మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి హీరోగా రాబోతున్న సరికొత్త చిత్రంలో రియా శింబు హీరోయిన్‌గా నటిస్తున్నట్లు సోషల్ మీడియాలో పలు పోస్టులు చక్కర్లు కొడుతున్నాయి. ప్రసిద్ధ దర్శకురాలు కిరుత్తిగ ఉదయనిధి ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నట్లు తెలుస్తోంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన షూటింగ్ కూడా శరవేగంగా ప్రారంభం కాగా.. మరో వారం రోజుల పాటు నిర్విరామంగా కొనసాగించి ముఖ్యమైన సీన్స్ పూర్తి చేయాలని మేకర్స్ ప్లాన్ చేశారట.

మానవ సంబంధాల మధ్య ఉండే సంక్లిష్టమైన భావోద్వేగాలను, పాత్రల మధ్య కెమిస్ట్రీని వెండితెరపై అద్భుతంగా ఆవిష్కరించడంలో దర్శకురాలు కిరుత్తిగ ఉదయనిధికి మంచి పేరుంది. అందువల్ల, విజయ్ సేతుపతి, రియా శింబు కాంబినేషన్‌లో ఆమె నుండి ఒక మంచి ఎమోషనల్ అండ్ ఇంట్రెస్టింగ్ డ్రామా రాబోతున్నట్లు నెటిజన్లు అభిప్రాయ పడుతున్నారు. కోలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ రెడ్ జెయింట్ స్టూడియోస్ భారీ నిర్మాణ విలువలతో, అద్భుతమైన విజువల్స్‌తో ఈ చిత్రాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది.